క్లుప్తంగా

మత్తు అలవాటు నివారణపై అవగాహన



వాకలపూడి సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి

కాకినాడ రూరల్: కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మత్తుకు వ్యతిరేకంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులకు మద్యం తాగుడు వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి, నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహనరావు, ఎస్సైలు వరహాలు, ఎండీ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్ను ఆటోమ్యుటేషన్ సేవపై అవగాహన



ఆస్తి పన్ను ఆటో మ్యుటేషన్ సేవపై అవగాహన కలిస్తున్న సర్పవరం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాస్

కాకినాడ లీగల్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటి నుంచి అమలులోకి తీసుకురానున్న ఆస్తి పన్ను ఆటో మ్యుటేషన్ సేవలుపై క్రయ విక్రయదారులు, దస్తావేజు లేఖర్లకు సర్పవరం సబ్ రిజిస్ట్రార్ వి.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కాకినాడ రూరల్ సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ముందుగా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఇళ్లు, ఫ్లాట్‌కు ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తేనే ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆస్తి రిజిస్ట్రేషన్ జరుగుతాయన్నారు. ఆస్తి రిజిస్ట్రేషన్ వచ్చే సమయానికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి రావాలని, ఎటువంటి పన్ను బకాయిలు ఉన్న రిజిస్ట్రేషన్‌కి ఇబ్బందులు ఉంటాయని తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్ : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామారావుపేటలోని పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, చోడిశెట్టి రమేష్‌బాబు, గూడూరు పద్మ, మొసలగంటి సురేష్, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డులో చికిత్స పొందుతున్న బాధితులకు బాలాజీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు అడ్వకేట్ గునిపే బాలాజీ, స్టాఫ్‌నర్సు హేమలతా దంపతుల ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కంజ్యూమర్ కమిషన్ మెంబర్లు సీహెచ్ శశి, చాగంటి నాగేశ్వరరావు, అడ్వకేట్ ఆదిత్యకుమార్ అతిథులుగా హాజరై 40 మంది బాధితులకు అందించారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు బాలాజీ తెలిపారు. అడ్వకేట్లు సీహెచ్ అమోస్, మండపల్లి శ్యామ్, పెదపాటి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.1.88 లక్షలు



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,88,861 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా 3500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

యువత చూపు.. స్మార్ట్ వాచ్‌ల వైపు..

- అందుబాటులో ఉన్న స్మార్ట్ వాచ్‌లు
- పాత తరం గడియారాలకు చెల్లు

బోట్‌క్లబ్: ఒకప్పుడు వాచ్ అంటే టైం చూసుకోవడం కోసమో, తేదీలు తెలుసుకోవడానికో ఉపయోగించేవారు. ప్రస్తుతం వాచ్‌లు మన పనులు మనకు గుర్తుచేసేలా ఉంటున్నాయి. వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో స్మార్ట్‌వాచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిపై యువత ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ స్మార్ట్‌వాచ్‌లో సెల్‌ఫోన్‌లో ఉపయోగించే ఫీచర్స్ అన్ని ఉండడంతో యువత వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ద్విచక్రవాహనం, కార్లు నడిపేవారు సెల్‌ఫోన్ మోగితే మాట్లాడడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కానీ ఈ స్మార్ట్‌వాచ్‌లో మాట్లాడుకొనే ఫీచర్లు ఉండడంతో ప్రతి ఒక్కరూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఇవి రూ.వెయ్యి దగ్గర నుంచి రూ.లక్ష రూపాయల వరకూ వివిధ ధరల్లో అందుబాటులో ఉన్నాయి. స్మార్ట్ ఫోన్ల మాదిరిగానే స్మార్ట్‌వాచ్‌లు కూడా అవసరమైన ఫ్యాషన్ ఉపకరణాలుగా మారాయి. ఈ వాచ్‌లలో మనం చేసే రోజువారీ పనులను కూడా సులభతరం చేసే అనేక ఫీచర్లు ఉంటున్నాయి. అధునాతన ఫీచర్లతో కెమెరా, సిమ్ కార్డ్ ఆప్షన్లు కూడా వీటిలో ఉంటున్నాయి. కాకినాడ నగరంలో సెల్‌ఫోన్ విక్రయించే ప్రతి దుకాణంలోను ఈ స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉంటున్నాయి. కాకినాడ నగరంలో సుమారు 130 దుకాణాల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో దుకాణంలో ప్రతి రోజు మూడు నుంచి నాలుగు వాచ్‌లు విక్రయిస్తున్నారు. నగరంలో సుమారు 20కి పైగా పెద్ద షోరూమ్‌లు ఉన్నాయి. పెద్ద షోరూమ్‌లో 10 నుంచి 20 వాచ్‌లు విక్రయిస్తున్నారు. మగవారితో పోటీ పడి మరీ ఆడవాళ్లు స్మార్ట్‌వాచ్‌లు కొనుగోలు చేస్తున్నారని విక్రయదారులు తెలిపారు.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న స్మార్ట్‌వాచ్‌లు

బ్లూటూత్ ఆప్షన్

స్మార్ట్‌వాచ్‌లో బ్లూటూత్ ఆప్షన్ ఉంటుంది. ఈ వాచ్‌ల్లో టూత్ పరికరాలను కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఈ వాచ్ ఉపయోగించి ఫోన్ కాల్స్‌ను స్వీకరించవచ్చు. డయల్ కూడా చేయవచ్చు. మెసేజ్‌లు కూడా పంపించవచ్చు. సోషల్ మీడియా నోటిఫికేషన్లు కూడా ఫోన్‌లో అందుబాటులో ఉన్నాయి.



దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్మార్ట్‌వాచ్‌లు

ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదం

ప్రస్తుత కాలంలో చాలా మంది వ్యక్తులు రోజంతా తమ కంప్యూటర్లు ముందు కూర్చుని పనిచేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయాల్లో మన ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. స్మార్ట్ వాచ్‌లు ఉంటే మన కార్యాచరణ, నిద్ర, మంచినీరు తాగడం, ఎక్కువ సేపు కూర్చుని ఉంటే నిలబడాలని సూచించడం విలువైన అంశాలను ఇవి అందిస్తున్నాయి. దీంతో మనం ఏ సమయానికి ఏమి చేయాలో అనే అంశాలపై మనకు అర్థమవుతుంది. శరీర ఉష్ణోగ్రత, హృదయ స్పందన రేటును తనిఖీ చేస్తుంది.

మెరుగైన వ్యాయామం కోసం

మెరుగైన వ్యాయామం చేసేందుకు ఈ స్మార్ట్ వాచ్‌లు దోహదపడుతున్నాయి. ఫిట్‌నెస్ లక్ష్యాలను పర్యవేక్షించడం, ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. హార్ట్‌బీట్ నోటిఫికేషన్ వినియోగదారులకు వ్యాయామం చేస్తున్నప్పుడు తమను తాము ఎక్కువ శ్రమించడంపై హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రతి రోజు మీరు ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నారో తెలుపుతుంది.

ఎంతో ఉపయోగం



మా నాన్న పుట్టిన రోజు గిఫ్ట్‌గా నాకు స్మార్ట్ వాచ్ ఇచ్చారు. ప్రతి రోజు నేను ఎన్ని అడుగులు వేస్తున్నాను. ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నానో ఈ వాచ్‌లో తెలుస్తుంది. వాచ్‌లో ఎన్నో ఫ్యూచర్ చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

– టి.ప్రశాంత్

ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ



ఎస్పి బిందుమాధవ్‌ను కలిసిన సత్యనారాయణ

కాకినాడ క్రైం: కాకినాడ స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా కూనపురెడ్డి వెంకట సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లోభాగంగా రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన కాకినాడ జిల్లా ఎస్‌బీకి బదిలీపై వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించి జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి శనివారం తెలిపారు. ఖాళీ ఉన్న సీట్లను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

దివ్యాంగులను ఆదుకోండి



దివ్యాంగుడు బాషాకు బ్యాటరీ వాహనాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, చిత్రంలో సిటీ యూత్ అధ్యక్షుడు రోకళ్ల సత్య తదితరులు

- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో దివ్యాంగులకు చేయూతనందించాలని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన దివ్యాంగుడైన బషీర్ మూడుచక్రాల బ్యాటరీ వాహనం కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుని గత కొన్ని నెలలుగా పాలకుల వద్దకు తిరుగుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లభించ లేదు. వాహనం మంజూరుకాకపోవడంతో ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ సిటీ యూత్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్య మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి బషీర్‌తో పాటు మరో ఇద్దరు దివ్యాంగులకు సొంత నిధులతో కొనుగోలు చేసిన మూడు బ్యాటరీ వాహనాలను శనివారం రామకృష్ణారావుపేటలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు, పార్టీ యూత్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్య, వక్ఫ్‌బోర్డు ప్రతినిధి రెహ్మాన్‌ఖాన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండీ మబుల్‌భాషా(చోటా), మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ బాషా, 33వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి బోరా పెద్ద, పార్టీ నేతలు కొయ్యా రమణ, దలాయి వేణు తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రోబో ప్రయోగాలు మరింత సులువు



బిడ్యుట్ ఇన్నోవేషన్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకొంటున్న కైట్ విద్యాసంస్థల ప్రతినిధులు

బోట్‌క్లబ్: హ్యూమన్ రోబోతో విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఎంతో వీలుంటుందని కైట్ విద్యాసంస్థల డైరెక్టర్ ఐశ్వర్య అన్నారు. కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఏఐ ఆధారిత రోబోట్‌తో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఇండోర్‌కు చెందిన బిడ్యుట్ ఇన్నోవేషన్ సంస్థతో ఏంఓయూ కుదుర్చుకున్నట్టు శనివారం తెలిపారు. రోబోటిక్స్‌తో శిక్షణ ఇచ్చే మొదటి విద్యాసంస్థగా తమకు సంస్థ నిలిచిందన్నారు. కైట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ రేవతి, రామకృష్ణ మాట్లాడుతూ హ్యూమన్ రోబోట్ అత్యంత కంప్యూటింగ్ సామర్థ్యం కలదన్నారు. 8 కోర్ హైస్పీడ్ పర్ఫామెన్స్‌తోపాటు ఇతర అత్యాధునిక ఫీచర్‌తో కారణంగా రియల్ టైం అప్లికేషన్‌లో విద్యార్థులకు రీసెర్చుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి కొత్త విధానాలకు కైట్ విద్యాసంస్థలు హ్యూమన్ రోబోట్‌తో నాంది పలికాయన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

బాలాజీచెరువు: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. విద్యార్థుల ఆనందానికి స్థానిక సూర్యకళామందిరం శనివారం వేదికగా నిలిచింది. అశోక్‌నగర్ ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడకలతోపాటు ఫ్రెషర్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేషనల్ అవార్డు గ్రహీత లక్ష్మీ తులసి హాజరై మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని, నేటి కాలంలో పిల్లలకు బంధవ్యాల విలువలు నేర్పించాలన్నారు. కళాశాల డైరెక్టర్ మతుకుమిల్లి విజయ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడంతో సంతృప్తి కలుగుతుందని, విద్యతోపాటు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పదో తరగతి టాపర్స్‌ను సత్కరించారు. ఆల్‌ఈజ్‌వెల్ అధ్యక్షులు కిషోర్, నారాయణ, సుజ్ఞాన్, దేవబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

28న స్పాట్ అడ్మిషన్లు

గోకవరం: వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఇంటర్‌లో ఖాళీల భర్తీకి ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎంవీయూ రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్లతో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

పారిశ్రామికవేత్తలకు త్వరితగతిన అనుమతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్‌విండో విధానం కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఏక గవాక్ష విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు, రాంపు ప్రోగ్రామ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 486 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 449 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, మిగతా 37 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నింటిపై నిర్దిష్ట గడువు లోపు తగిన పరిష్కారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ, పావలవడ్డీ, విద్యుత్, తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 31 యూనిట్లకు సుమారుగా రూ. 67.44 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, రవాణా శాఖా అధికారి జీవీ శివారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణమూర్తి, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేష్, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ వితరణ



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నరసింహం, చిత్రంలో విష్ణువర్ధన్, లావణ్యకుమారి తదితరులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు దివీస్ లేబొరేటరీస్ ఆర్వో వాటర్ ప్లాంట్లను వితరణ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో రూ.13.50 లక్షల విలువైన రెండు ప్లాంట్లను ఆర్ఎంసీలో క్యాంటీన్, ఎగ్జామినేషన్ హాల్లో ఏర్పాటు చేయగా రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం వీటిని ప్రారంభించారు. దీంతో కళాశాలలో మంచినీటి సదుపాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.

యాత్ర దర్శిని పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో బాదం బాలకృష్ణ, నమశ్శివాయ తదితరులు

కాకినాడ రూరల్: ద్రాక్షారామం 108 పాద శివలింగాల యాత్ర దర్శిని పుస్తకాన్ని రమణయ్యపేట శ్రీపీఠంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టరు బాదం బాలకృష్ణ, శివ భక్తుడు కాళ్ల సాంబశివరావు చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ద్రాక్షారామ యాత్ర విశేషాలను రచయిత మంగపతి రచించగా డాక్టరు గరికిపర్తి నమశ్శివాయ, నాగమణి దంపతులు పుస్తకాన్ని ప్రచురించారు. పుస్తకావిష్కరణ అనంతరం బాదం బాలకృష్ణ, నాంబశివరావు మాట్లాడుతూ ద్రాక్షరామం 108 పాద శివ లింగాల యాత్ర దర్శిని శివ భక్తులకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. రచయిత మంగపతి మాట్లాడుతూ తాను నాలుగు సంవత్సరాలు స్వయంగా 108 శివ లింగాలను దర్శించుకుని పుస్తకం రచించినట్టు తెలిపారు. ప్రచురణ కర్త నమశ్శివాయ, నాగమణి దంపతులు మాట్లాడుతూ పుస్తక ప్రచురణకర్తలుగా ఉండడం తమ పూర్వ జన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో సత్కళావాహిన సభ్యురాలు కంచి లక్ష్మి, జంగం సంఘ నాయకులు నాగేశ్వరరావు, నాగమణి, రామం, దాస్, కుంజిక లక్ష్మి, ఉదయ్ భాస్కర్, లయన్స్ క్లబ్ స్టార్ ప్రెసిడెంట్ ప్రసాదనాయుడు, రాజశేఖర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర నాచు పెంపకం ఒక జీవనోపాధి

కొత్తపల్లి: సముద్రపు నాచు పెంపకం ఒక జీవనోపాధి మార్గమని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్, ప్రిన్స్‌పాల్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ ఎస్.అంజలి అన్నారు. స్థానికంగా ఉన్న సురక్షా పేలస్‌లో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సహకారంతో తొండంగి, కొత్తపల్లి మండలాలకు చెందిన మత్స్యకార మహిళలకు సముద్రపు నాగు పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి భృతిని కల్పించుటకు, నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు తీరప్రాంతంలో వీటిని పెంచడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి 1.12 మిలియన్ల టన్నుల నాచును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీని పెంపకానికి రాయితీ పథకాలు ప్రకటించారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో అమీనాబాదు, గొర్సపాలెం ప్రాంతాల్లో సముద్రపు నాచు పెంపకానికి అనువైన ప్రదేశాలుగా గుర్తించామని, ఈ శిక్షణ అనంతరం హాజరైన 60 మందికి కార్పొరేటివ్ సామాజిక భద్రత పథకం ద్వారా దివీస్ లేబరేటరీ నుంచి రూ.4.80 లక్షలు సహకారంతో రాఫ్టలను ఏర్పాటు చేసేందుకు, తయారైన నాచును ఆరబెట్టేందుకు సోలార్ డ్రయ్యర్లను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కరుణాకరరావు, అసోసియేట్ హర్ష పాల్గొన్నారు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: పర్యావరణానికి ముప్పును కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. అరట్లకట్ట గ్రామంలో శనివారం ఆయన పర్యటించి పంచాయతీ, సచివాలయం సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పారిశుధ్యకార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. తర్వాత ఆయన పంచాయతీ సిబ్బందితో ప్రజలను కల్సి వీధులలో చెత్త,చెదారం వేయకుండా పారిశుధ్యకార్మికులు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడదీసి, ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు వాడడంవల్ల కలిగే అనర్థాలను వివరించి, వివాహాది శుభకార్యాలు, ఇతర ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు వినియోగించవద్దన్నారు. గ్రామ పంచాయతీ పని తీరును తెలుసుకోవడానికి వచ్చే ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ గురించి వివరించి, అడిగిన ప్రశ్నను అర్థం చేసుకుని, సరైన సమాధానం చెప్పాలని డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి వై.రాంజీ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో జవాన్ల త్యాగాలు మరువలేనివి

బాలాజీచెరువు: దేశ రక్షణలో జవాన్ల త్యాగాలు మరవలేనివని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ దివాస్ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో నగర వీధుల్లో నిర్వహించిన ర్యాలీను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. దేశభక్తితోపాటు వారి త్యాగాలను గుర్తుపెట్టుకోవడం ప్రతి ఒక్కపౌరుడి బాధ్యతన్నారు.1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ డాక్టర్ కే.జయదేవ్, జంతుశాస్త్ర విభాగాధిపతి చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలో ఉన్న అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు అధ్వర్యంలో నిర్వహిహించిన కార్యక్రమంలో జోన్‌చైర్మన్ దొడ్డివీరేంద్ర పాల్గొని సైనికుల సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దిలీప్‌కుమార్ మురళీధర్, మనోహర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న రిటైర్డు ఆర్మీ మేజర్ జనరల్ జ్యోతుల వెంకట ప్రసాద్

దేశ రక్షణకు నిరంతర కృషి

కాకినాడ రూరల్: మన దేశానికి చెందిన త్రివిధ దళాలు దేశ రక్షణకు నిరంతరం కృషి చేస్తాయని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. స్థానిక బోటుక్లబ్ ఉద్యానవనంలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్గిల్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో త్రివిధ దళాలకు చెందిన మాజీ సైనికోద్యోగులు ఎస్.శ్రీ నగేష్, ఎస్. రామారావు, బి.శంకర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీధర్ ,బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, శ్రీరామరాజు, కృష్ణంరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైనికులు సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: మన దేశ రక్షణలో సైనికులు అందిస్తున్న సేవలు మరువలేనివని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ అధ్యక్షుడు వీఎల్ గాంధీ అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో శనివారం కార్గిల్ విజయోత్సవం నిర్వహించారు. కేవలం సైనికుల ధైర్య సాహసాల కారణంగా మనమంతా హాయిగా జీవిస్తున్నామన్నారు. రిటైర్డు ఆర్మీ మేజర్ జనరల్ జ్యోతుల వెంకట ప్రసాద్ మాట్లాడుతూ మన భారతదేశం ఎంతో సుంపన్నమైన నాగరికత, వివిధ సంస్కృతుల నిలయమన్నారు. వాటిని కాపాడుకోవం మనందరి బాధ్యతన్నారు. మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యక్షుడు వక్కలంక రామకృష్ణ, స్కూల్ ప్రధానోపాధ్యాయిలు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అలయన్స్‌క్లబ్ సభ్యులు

యానిమేటర్ల అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు



యానిమేటర్ల అడ్‌హాక్ కమిటీ

కాకినాడ రూరల్: వాకలపూడిలో కోరమాండల్ కమ్యూనిటీ హాలులో జిల్లా యానిమేటర్ల అడహక్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలుగా ఎస్.పద్మ, ఉపాధ్యక్షురాలుగా ఆర్.విజయకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమణమ్మ, జాయింట్ సెక్రటరీగా రమాదేవి, కోశాధికారిగా మహాలక్ష్మి, కార్యనిర్వాహకులుగా చాయాకుమారి, సూర్యలక్ష్మి, సభ్యులుగా కుమారి, శ్రీదేవి, సుభాషిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బెగి ఫణీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. స్థానిక మున్సిపల్ మెప్మా కార్యాలయంలో శనివారం మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, ఇతర చట్టాలపై మహిళా సభ్యులందరికి కనీస అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుతం మహిళలు అనేక రకాల ఇబ్బందులు, వేధింపులకు గురవుతున్నారని, వీటి నుంచి బయటపడేందుకు ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ సెంటర్‌లోని మెప్మా విభాగం వస్తు విక్రమాల స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ జ్యోతిరాణి, బార్ అసోషియేషన్ కార్యదర్శి ఎస్‌కే వల్లీబాబు, సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐ మౌనిక, న్యాయవాదులు పాల్గొన్నారు.